సాక్షి
కర్నూలు
సోమవారం । 17 । జూన్ । 2024



ఘనంగా పల్లకీ సేవ

శ్రీశైలం టెంపుల్: లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ఆదివారం భ్రామరీ సమేత మల్లికార్జున స్వామికి ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి పూజలు చేపట్టారు.



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళారాధన వేదికపై ఆదివారం అనంతపురానికి చెందిన అమృత కూచిపూడి నృత్యకళా నిలయం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

మంత్రాలయంలో హైకోర్టు జడ్జి



మంత్రాలయం: కర్ణాటక హైకోర్టు జడ్జి ఇంద్రేష్ ఆదివారం మంత్రాలయం వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మకు హారతులు పట్టారు. రాఘవేంద్రుల మూలబృందావనానికి పూజలు చేశారు.

న్యూస్‌రీల్

శ్రీమఠంలో భక్తుల సందడి



మఠం కారిడార్‌లో భక్తుల రద్దీ

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయం భక్తుల సందడితో కళకళలాడింది. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. దీంతో రాఘవేంద్రుల మూల బృందావన దర్శనానికి రెండు గంటల పాటు సమయం పట్టింది. గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రుల దర్శన క్యూ లైన్లు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాద కౌంటర్లు కిటకిటలాడుతూ దర్శనమిచ్చాయి.

మంత్రిని కలసిన కలెక్టర్



కర్నూలు: రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంకల్‌బాగ్‌లోని ఆయన నివాసంలో ఆదివారం కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అభివృద్ధి విషయాలపై ఇరువురూ చర్చించారు.

నేటి నుంచి థిమాటిక్ ఎగ్జిబిషన్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని కొండారెడ్డి బురుజు సమీపంలో ఉన్న లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్ ఎంపోరియం దగ్గర ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు థిమాటిక్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, ఉడ్ కార్వింగ్, దుర్గి స్టోన్ ఐటమ్స్, ఆళ్లగడ్డ రాతి చిత్రాలు, మదనపల్లి-టెర్రికోట మట్టి బొమ్మలతో ఐదు రోజుల పాటు ఎగ్జిబిషన్, సేల్స్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అపురూపమైన చేతి వృత్తులకు మరింత ఆదరణ కల్పించాలనే లక్ష్యంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తయారీదారులే విక్రయిస్తారని, సరసమైన ధరలకే బొమ్మలు, ఇతర వస్తువులు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

☛ గూడూరు మండలానికి చెందిన సోమక్క భర్తతో పాటు వ్యవసాయ పనులకు వెళ్లేది. ఆమెకు ముగ్గురు సంతానం కావడంతో ఇక చాలనుకుని ఇటీవలే కు.ని ఆపరేషన్ చేయించుకుంది. నీ భార్య కంటే నువ్వు ఆపరేషన్ చేయించుకుంటే మేలు కదా.. పది నిమిషాల్లోనే చిన్న ఆపరేషన్ చేస్తారని ఏఎన్ఎంలు భర్తకు నచ్చజెప్పినా ఆయన వినలేదు. ఆపరేషన్ చేయించుకుంటే శక్తి తగ్గిపోతుందని చాలా మంది చెబుతున్నారు. నేను చేయించుకోనని మొండికేయడంతో భార్యకు కు.ని ఆపరేషన్ తప్పలేదు.

☛ గోనెగండ్ల మండలానికి చెందిన లక్ష్మీదేవి ఇంట్లోనే పాడిగేదెలను చూసుకుంటూ పాలవ్యాపారం చేస్తుంది. ఇటీవలే ఆమెకు ముగ్గురు పిల్లలు పూర్తి కావడంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంది. ఇంట్లో నీవు పనిచేసుకుంటావు. నీ భర్తతో వేసక్టమి అనే కు.ని ఆపరేషన్ చాలా సులభంగా ఉంటుంది. ఆయనకు ఎలాంటి ఇబ్బంది ఉండదని వైద్య సిబ్బంది చెప్పారు. కానీ ఆమె వినలేదు. ఆయన బయట తిరిగేటోడు...శక్తి తగ్గిపోతుందంట. ఏ పనీ చేయలేడంట అని ఆమె తానే ఆపరేషన్‌కు ముందుకు వచ్చింది.



ఐదుగురే ‘మగాళ్లు’

కుటుంబ నియంత్రణకు ముందుకు రాని పురుషులు

- ఆపరేషన్ చేయించుకుంటే లైంగిక శక్తి తగ్గుతుందన్న అపోహ
- క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నా వెనకడుగు
- జిల్లాలో ఏడాదికి ఒకరిద్దరు మాత్రమే ముందుకు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఐదుగురికే వేసక్టమీ ఆపరేషన్

కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు పురుషులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వాలు ఎంత అవగాహన కల్పిస్తున్నా ఇలాంటి ఆపరేషన్ చేయించుకునేందుకు వెనకడుగేస్తున్నారు. కొంత మంది ముందుకు వస్తున్నా వారి భార్యలే వద్దంటున్నారు. తన భర్తకు లైంగిక సామర్థ్యం తగ్గిపోతుందని కొందరు, ఒంట్లో శక్తి కోల్పోయి పని చేయలేకుండా అయిపోతాడేమోనని మరికొంత మంది మహిళలు భర్తలను వెనక్కి లాగుతుండటంతో ఏటా ఒకరో, ఇద్దరో మాత్రమే వేసక్టమి ఆపరేషన్ చేయించుకుంటున్నారు.

ఐదేళ్లుగా కు.ని ఆపరేషన్లు

సంవత్సరం	లక్ష్యం	సాధన (ట్యూబెక్టమీ)	వేసక్టమీ
2019-20 (ఉమ్మడి జిల్లా)	25,000	16,556	0
2020-21 (ఉమ్మడి జిల్లా)	25,000	7,728	1
2021-22 (కర్నూలు జిల్లా)	14,058	7,575	1
2022-23 (కర్నూలు జిల్లా)	13,563	6,989	1
2023-24 (కర్నూలు జిల్లా)	13,000	8,062	2

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో 40 ఏళ్ల క్రితం ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు చాలంటూ ప్రచారం చేశారు. ఆ తర్వాత పదేళ్లకు ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలే ముద్దంటూ ప్రచారం వచ్చింది. ఇప్పుడు ఆడైనా.. మగైనా ఒక్కరే చాలనుకునే వారు కూడా ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధికారుల అంచనా ప్రకారం జిల్లా జనాభా 50 లక్షలు. పెరుగుతున్న జనాభాను అరికట్టేందుకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రోత్సహిస్తున్నాయి. అందులోభాగంగా కర్నూలు, నంద్యాల, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పీపీ యూనిట్లతో పాటు ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, బేతంచెర్ల, డోన్, నందికొట్కూరు, గూడూరు, గార్గేయపురం, డోన్‌తో పాటు కర్నూలులోని గడియారం ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. 2014వ సంవత్సరం వరకు ఏడాదికి 25 వేల నుంచి 34 వేల వరకు కు.ని ఆపరేషన్లు నిర్వహించేవారు. ఆ తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్ర విభజన జరిగిన కారణంగా జనాభా పెరగాలని, ఈ మేరకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు సంబంధించి ప్రజలపై ఒత్తిడి తేవొద్దని, లక్ష్యాలు కూడా తీసేయాలని పేర్కొంది.

ఐదేళ్ల నుంచి ఒక్కొక్కరుగా..

జిల్లాలో 2011 నుంచి 2019 వరకు ఒక్క పురుషుడు కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్(వేసక్టమి) చేయించుకోలేదు. అప్పటి వరకు మహిళలే ఆపరేషన్ చేయించుకుంటూ వచ్చారు. 2020 నుంచి ఏటా ఒక పురుషుడు చొప్పుడు ఆపరేషన్ చేయించుకుంటూ వస్తున్నారు. గత సంవత్సరం మాత్రం ఇద్దరు ఆపరేషన్ చేయించుకున్నారు. పెద్దగా కోత, కుట్టు లేకపోయినా, రక్తస్రావం రాకపోయినా, సంసార జీవితానికి ఎలాంటి డోకా లేకపోయినా మగవారు ఈ ఆపరేషన్ చేయించుకోవడానికి ముందుకు రాకపోవడానికి ప్రజల్లో పలు రకాల అనుమానాలే కారణం. ఆపరేషన్ చేయించుకుంటే మగవారిలో లైంగిక శక్తి తగ్గిపోతుందనేది ప్రధాన అపోహ.



వేసక్టమీపై అపోహలు వీడాలి

కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ను మగవారు కూడా చేయించుకోవచ్చు. ఇది మహిళల కంటే పురుషులకే సులభమైన ఆపరేషన్. కేవలం పది నిమిషాల్లో ఆపరేషన్ పూర్తవుతుంది. ఆపరేషన్ తర్వాత రెండు గంటల్లోనే ఇంటికి వెళ్లిపోవచ్చు. అన్ని రకాల ఆహారాన్ని తీసుకోవచ్చు. ఆపరేషన్ వల్ల ఎలాంటి శారీరక బలహీనత ఏర్పడదు. శక్తి, సామర్థ్యాలు ఏ మాత్రం కోల్పోరు. సంసార జీవితానికి ఎలాంటి డోకా ఉండదు. పిల్లలు కావాలనుకున్నప్పుడు రీకెనలైజేషన్ ఆపరేషన్ చేయించుకుని పిల్లల్ని కనవచ్చు.

– డాక్టర్ ఎస్.అబ్దుల్ సమ్మద్, యురాలజిస్టు, కర్నూలు

మగవారికి అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని పీహెచ్‌సీ, విలేజ్ హెల్త్ క్లినిక్స్ లెవెల్స్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా మగవారికి చేసే వేసక్టమీపై ఇప్పటికీ చాలా మందికి అపోహలు ఉన్నాయి. పురుషులతో పాటు వారి భార్యలు, చివరికి కుటుంబసభ్యులూ వద్దని చెబుతున్నారు. ఇలాంటి వారికి మా వైద్య సిబ్బంది వెళ్లి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ఆపరేషన్‌కు ఒప్పిస్తున్నారు. ఎవ్వరైనా వేసక్టమీ ఆపరేషన్ చేయించుకుంటామని ముందుకు వస్తే వారికి చేస్తున్నాం.

– డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ, కర్నూలు



నేడే బక్రీద్

ఎమ్మిగనూరులో సిద్ధం చేసిన ఈద్గా

ఎమ్మిగనూరుటౌన్: బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు జిల్లా ముస్లింలు సిద్ధమయ్యారు. పండుగ సందర్భంగా సోమవారం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ప్రార్థనల్లో భాగంగా ఉదయం ఈద్గాల వద్ద మత పెద్దలు మహమ్మద్ ప్రవక్త బోధనలు, సందేశాలు ఇవ్వనున్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక పోలీస్ బృందాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.


పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌ను మార్చేందుకు కుయుక్తులు

- తమ మాట వినేవారిని తెచ్చుకునేందుకు చర్యలు
- అప్పుడే ప్రయత్నాలు ప్రారంభించిన కొందరు ప్రజాప్రతినిధులు
- ఇతర ప్రాంతానికి బదిలీ అయి సెలవుపై ఉన్న ప్రొఫెసర్ వస్తారని ప్రచారం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌ను మార్చేందుకు జిల్లాలో కొందరు ప్రజాప్రతినిధులు అప్పుడే ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. ఇప్పటి వరకు గత పాలకులు చెప్పినట్లు విన్నవారు అధికారులుగా ఉన్నారని, ఇప్పుడు తమ మాట వినే అధికారిని తెచ్చుకోవాలని వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సూపరింటెండెంట్ గత కొన్నేళ్లుగా ఆసుపత్రిలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ మేరకు ఆసుపత్రిలో ఏ మూల ఎలాంటి సమస్య ఉంది, ఆసుపత్రికి ఏమి కావాలో ఆయనకు స్పష్టత ఉంది. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఒక్కొక్కటిగా పనిచేసుకుంటూ వస్తున్నారు. ఇదే సమయంలో ఆయనపై ఓ పార్టీ ముద్ర వేశారు. గతంలో ఆయన అప్పటి ప్రభుత్వానికి మద్దతు తెలిపారని, ఆ ప్రభుత్వానికి ప్రచారం చేశారని, ఆయనను తప్పనిసరిగా మార్చాల్సిందేనని పట్టుబడుతున్నట్లు సమాచారం. మరికొందరు వైద్యులు మాత్రం ఈ అధికారి ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి ప్రచారం చేస్తారని, గతంలోనూ టీడీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధులతో సన్నిహితంగా మెలిగారని గుర్తు చేస్తున్నారు. కోవిడ్ సమయంలో సోషల్ మీడియాలో ఆయన సూచించిన మందులు, చేసిన ప్రచారంతో ఆయన విపరీతంగా ఆదరణ పొందారు. ఈ మేరకు ప్రభుత్వ చర్యలను సమర్థిస్తూ పలు పోస్టులు పెట్టారు. దీంతో ఆయనపై ప్రత్యేక ముద్ర వేసి ఆయన మనవాడు కాదని, మనవాన్ని తెచ్చుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఉన్నత స్థాయిలో పావులు సైతం కదిలిస్తున్నారు. గతంలో ఓ స్పెషాలిటీ విభాగంలో పనిచేసి ఇతర ప్రాంతానికి బదిలీ అయి, అక్కడికి వెళ్లకుండా సెలవులో ఉన్న ఓ ప్రొఫెసర్‌ను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

పైరవీల సర్కిల్‌లో ‘నాలుగో’ సింహం

- సర్కిల్ పోస్టు కోసం పోటీ పడుతున్న పది మంది ఇన్‌స్పెక్టర్లు
- కొనసాగేందుకు ప్రస్తుత అధికారి యత్నం
- ఒప్పించేందుకు మంత్రి పీఏతో ఫోన్
- ఆ సీఐ వద్దని నిరాకరించిన ‘ప్రజాప్రతినిధి’



కర్నూలు: పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓ పోలీస్ సర్కిల్ సీటు కోసం భారీగా పోటీ నెలకొంది. దాదాపు పది మంది ఇన్‌స్పెక్టర్లు ఈ సీటు దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వీరిలో ఇదే స్టేషన్‌లో ఎస్‌ఐలుగా పనిచేసి పదోన్నతి పొంది వివిధ సర్కిళ్లలో పనిచేస్తున్నవారు ఐదుగురు ఉన్నారు. అలాగే గతంలో సీఐలుగా పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు మళ్లీ ఈ సీటు దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు. కొందరు ప్రత్యక్షంగా, మరికొందరు పరోక్షంగా పోస్టింగ్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. గతంలో పనిచేసిన అనుభవాన్ని, సామాజిక వర్గాన్ని చూపించి ఆ నియోజకవర్గం నేతను పోస్టింగ్ అడుగుతున్నారు. మీ అధికారంలో మీరు చెప్పినట్లే పని చేస్తామంటూ ఆ సర్కిల్ పోస్టింగ్ కోసం ఇన్‌స్పెక్టర్లు ప్రస్తుత ప్రజాప్రతినిధి వద్ద పైరవీలు కొనసాగిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

వివాదాస్పద అధికారి యత్నాలు

సర్కిల్ సీటును దక్కించుకునేందుకు వారికి అనుకూలమైన నేతల ద్వారా ఇన్‌స్పెక్టర్లు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోనే ప్రాధాన్యత, పరపతి ఉండే ఆ సర్కిల్ కుర్చీ ఎలాగైనా దక్కించుకోవాలని సన్నిహితుల ద్వారా ఇన్‌స్పెక్టర్లు ఎమ్మెల్యే ఇంటికి క్యూ కడుతున్నారు. కొందరు ఇన్‌స్పెక్టర్లు తమ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, ద్వితీయ శ్రేణి నేతలతో ఒత్తిడి చేయిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. కోర్టు మానిటరింగ్ సెల్, సీసీఎస్‌లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు ఈ సీటును దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. గతంలో కర్నూలు తాలూకాలో పనిచేసి ఆరోపణలతో ఇతర ప్రాంతానికి బదిలీపై వెళ్లి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఓ ఇన్‌స్పెక్టర్ కూడా ఈ సీటు దక్కించుకునేందుకు ఆయనతో సన్నిహితంగా ఉంటున్న అధికార పార్టీ నేతల ద్వారా ప్రయత్నిస్తున్నారు. వివాదాస్పద అధికారి అనే ముద్ర ఈయనపై ఉంది. చిన్న సమస్యను కూడా పెద్దదిగా చూపి స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులను బెదిరిస్తుంటాడన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఓ విలేకరి పట్ల దురుసుగా ప్రవర్తించి ఉన్నతాధికారులతో చీవాట్లు కూడా తిన్నారు. ఈయన గతంలో ఇదే స్టేషన్‌లో ఎస్‌ఐగా కూడా విధులు నిర్వహించారు.

సమీప బంధువులతో సిఫార్సులు

కర్నూలు విజిలెన్స్ విభాగంలో పనిచేసిన ఓ ఇన్‌స్పెక్టర్ నంద్యాల జిల్లాలోని జిల్లా సరిహద్దు సర్కిల్‌లో పనిచేస్తున్న మరో సీఐ కూడా ఈ సీటు దక్కించుకునేందుకు అనుకూలమైన ప్రజాప్రతినిధి ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసు అధికారుల్లో చర్చ జరుగుతోంది. గతంలో పోలీసు శాఖలో ఉన్నత స్థాయి స్థానంలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఓ అధికారికి ఈయన సమీప బంధువు. ఈయనతో సిఫార్సులు చేయిస్తున్నట్లు సమాచారం. అలాగే ఎలక్షన్ సెల్‌లో పనిచేస్తున్న మరో అధికారి కూడా ఈ సీటు దక్కించుకునేందుకు తన సామాజిక వర్గం ద్వారా ముమ్మర యత్నాలు చేస్తున్నారు. ఇదే స్టేషన్‌లో ఈయన ఎస్‌ఐగా కూడా పనిచేశారు. అలాగే కర్నూలు లూప్‌లైన్ విభాగంలో పనిచేస్తున్న ఓ మహిళ ఇన్‌స్పెక్టర్ కూడా ఈ సీటును దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు పోలీసు అధికారులు చర్చించుకుంటున్నారు.

ప్రస్తుత అధికారి యత్నం...

గత రెండేళ్లుగా ఆ సీటులో కొనసాగుతున్న ఇన్‌స్పెక్టర్ మరి కొంతకాలం కొనసాగేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జిల్లాకు చెందిన ఓ మంత్రి పీఏ ద్వారా ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధికి ఫోన్ చేయించారు. అందుకు ఒప్పుకునేది లేదంటూ నిరాకరించడంతో పోలీసు, న్యాయశాఖలో పనిచేస్తున్న తనతో అనుబంధం ఉన్న అధికారుల ద్వారా కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఎస్‌ఐ నుంచి సీఐగా పదోన్నతి పొందిన తర్వాత సీమ జిల్లాల కోర్టు మానిటరింగ్ లైజనింగ్ అధికారిగా అమరావతిలో రెండేళ్ల పాటు పనిచేశారు. హైకోర్టులో పనిచేస్తున్న కొందరు అధికారులతో ఈయనకు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. వారి ద్వారా కూడా స్థానిక ప్రజాప్రతినిధిపై ఒత్తిడి చేసి ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఆ ఇన్‌స్పెక్టర్‌ది సొంత జిల్లా తిరుపతి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆ జిల్లాలో గెలుపొందిన ప్రజాప్రతినిధులను రెండు రోజుల క్రితం కలసి ప్రజాప్రతినిధిని ఒప్పించేలా ఫోన్ చేయించినట్లు కొందరు అధికారులు చర్చించుకుంటున్నారు.

భారీగా ఆదాయ వనరులు...

గతంలో ఈ సర్కిల్‌లో ఎస్‌ఐలుగా పనిచేసిన ఐదుగురు ఇక్కడ ఉన్న కొద్ది రోజుల్లోనే భారీ మొత్తంలో మామూళ్లు రావడం చూసి తిరిగి ఆ సీటు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారు. సబ్సిడీ బియ్యం, ఇసుక అక్రమ రవాణా, భూ వివాదాల వంటి కేసులు ఈ సర్కిల్‌లో ఎక్కువగా నమోదవుతుంటాయి. అదే స్థాయిలో ఆమ్యామ్యాలు కూడా అందుతుంటాయి. వీటితో పాటు అక్రమ వ్యాపారాలు సాగించేవారు, డాబాల నిర్వాహకులు, భారీ వాహనాల యజమానులు, ఆటోమొబైల్ దుకాణాల నుంచి నెలవారీ మామూళ్లు ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ సర్కిల్ పోస్టింగ్ కోసం ఇన్‌స్పెక్టర్ల మధ్య పోటీ పెరిగింది. అధికార పార్టీ ‘యువ నేత’ అండతోనైనా సరే కుర్చీలో మరికొంత కాలం కొనసాగాలని అక్కడి ఇన్‌స్పెక్టర్ ప్రయత్నిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఈ సర్కిల్‌కు రాకముందు ఆర్థిక సమస్యల్లో ఉన్న ఆ అధికారి రెండేళ్ల పాటు ఇక్కడ పనిచేశారు. అప్పులన్నీ తీర్చేసి ఆర్థికంగా స్థిరపడ్డాడని సహోద్యోగులే చర్చించుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పోలీసు శాఖలో భారీ మార్పులు తప్పవని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పోస్టింగ్ దక్కించుకునేందుకు కొందరు ఇన్‌స్పెక్టర్లు అమరావతి బాట పట్టగా మరికొందరు జిల్లా మంత్రి ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి జిల్లాకు వచ్చిన మంత్రి ఇంటి వద్దకు రెండు రోజులుగా పోలీసు అధికారులతో పాటు రెవెన్యూ శాఖలో వివిధ హోదాలో పనిచేస్తున్న అధికారులు క్యూ కట్టారు. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఒక్కరోజే సుమారు 20 మంది పోలీసు అధికారులు వేర్వేరు సమయాల్లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలసి పోస్టింగుల మాట ప్రస్తావించినట్లు సమాచారం. గతంలో పోలీసు శాఖలో బదిలీలు ఎస్పీ, ఐజీ చేతుల మీదుగా సాగేవి. స్టేషన్ల గ్రేడింగులు, అధికారుల సామర్థ్యత ఆధారంగా పోస్టింగులు కేటాయించేవారు. తాజాగా ఆ పరిస్థితి మారింది. పోలీసు శాఖలో బదిలీలు పూర్తిగా నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. వారు ఎవరికి సిఫారసు చేస్తే వారికే పోస్టింగులు దక్కే పరిస్థితి ఉండటంతో ఇన్‌స్పెక్టర్లు నేతల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



మహాసంప్రోక్షణ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

శాస్త్రోక్తంగా బాలాలయ ప్రతిష్ట



మహాకుంభ కలశాలను తీసుకువస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం దిగువ అహోబిలంలో బాలాలయ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం శాస్త్రోక్తంగా ముగిసింది. వేకువజామున సుప్రభాత సేవతో మూలమూర్తిని మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం మూలమూర్తి శ్రీ ప్రహ్లాద వరదస్వామిని నవకలశాలలో ఆవాహన చేసి వాటిని మంగళ వాయిద్యాలతో బాలాలయ కళాకర్షణం గావించారు. అనంతరం దిగువ అహోబిలంలో ప్రధాన గుడిని మూసి మూలమూర్తి దర్శనం నిలిపివేశారు. వచ్చే నెల 3 నుంచి 7వ తేదీ వరకు జీర్ణోద్ధరణ అష్టబంధన మహా సంప్రోక్షణ చేపట్టనున్నారు. అనంతరం మూలమూర్తి శ్రీ ప్రహ్లాదవరదస్వామి దర్శనం చేసుకోవచ్చని ఆలయ వర్గాలు తెలిపారు.

శ్రీగిరికి పోటెత్తిన భక్తజనం



మల్లన్న దర్శనానికి బారులుదీరిన భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు ఆదివారం శ్రీగిరికి చేరుకున్నారు. వేకువ జాము నుంచి పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులుదీరారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. సర్వ దర్శనానికి 4 గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు దేవస్థాన అధికారులు పంపిణీ చేశారు. పలువురు భక్తులు మల్లన్నకు రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులు కళకళలాడుతున్నాయి.

క్లుప్తంగా

ఆదోనిలో సినీ నటుడు సుమన్



ప్రజలకు అభివాదం చేస్తున్న సినీ నటుడు సుమన్

ఆదోని అర్బన్: ప్రముఖ సినీ నటుడు సుమన్ ఆదివారం ఆదోని పట్టణంలో సందడి చేశారు. ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని ఒక షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతరం అభిమానులతో సెల్ఫీ దిగారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి యోగా పోటీలు

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు 8-10 , 10 -12 , 12 -14 , 14- 16, 16- 18 సంవత్సరాల వయస్సు వారికి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9247400100 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పారిశ్రామికంగా కర్నూలు అభివృద్ధి



మాట్లాడుతున్న ఐ. విజయకుమార్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): త్వరలో పారిశ్రామికంగా కర్నూలు జిల్లా అభివృద్ధి చెందుతుందని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఐ. విజయకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 58వ సర్వసభ్య సమావేశం మున్సిఫ్‌కోర్టు రోడ్డులోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలుకు చెందిన టీజీ భరత్ వాణిజ్య మంత్రిగా ఉన్నందున చాంబర్ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 905 మంది జీవితకాల సభ్యులతో చాంబర్ వ్యాపారస్తులకు సంబంధించిన ఇన్‌కమ్ ట్యాక్స్ తదితరాల విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కార్యదర్శి టీవీ రత్నప్రసాద్, కోశాధికారి కె. మురళీధర్ కల్యూకర పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో వీహెచ్‌పీ కమిటీలు

కర్నూలు కల్చరల్: ప్రతి గ్రామంలో వీహెచ్‌పీ కమిటీలు ఏర్పాటు చేయాలని విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు సూచించారు. ఆదివారం స్థానిక రెవెన్యూ కాలనీలోని కార్యాలయంలో వీహెచ్‌పీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీహెచ్‌పీ షష్టిపూర్తి పూర్తి చేసుకుంటున్న ఈ తరుణంలో గ్రామ గ్రామాన కమిటీలు వేయాలన్నారు. జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ మాట్లాడుతూ.. జిల్లాలో 9 మండలాల్లో నగరంలోని 195 కాలనీల్లో సమితుల నిర్మాణం చేయాలన్నారు. రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, జిల్లా కార్యదర్శి భాను ప్రకాష్, సహకార్యదర్శులు గిరిబాబు, గోవిందరాజులు పాల్గొన్నారు.

చేరువైన రైలు ప్రయాణం

- తిరుపతి రైలుకు తగ్గని రద్దీ
- అమరావతికి రైలు ప్రయాణం సులభతరం
- నంద్యాల- ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో పెరిగిన రైళ్ల రాకపోకలు
- డెమోతోపాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- మరికొన్ని రైళ్లు నడపాలని ప్రతిపాదన



నంద్యాల - ఎర్రగుంట్ల రైల్వేలైన్



ధర్మవరం- మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు

కోవెలకుంట్ల: రేనాటి ప్రజలకు రైలు ప్రయాణం చేరువైంది. నంద్యాల- ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఉప్పలపాడు, నొస్సం, సంజామల, కోవెలకుంట్ల, బనగానపల్లె, మద్దూరు ప్రాంతాల్లో రైల్వేస్టేషన్లు ఉన్నాయి. రెండు జిల్లాల ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 2016 ఆగస్టు నెల నుంచి ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. నంద్యాల నుంచి చిత్తూరు జిల్లా రేణిగుంట వరకు డెమో, అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి రాష్ట్ర రాజధాని అమరావతి మీదుగా మచిలీపట్నం వరకు, గుంటూరు నుంచి తిరుపతికి ప్రతి రోజు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు ఆయా జిల్లాల పారిశ్రామిక అభివృద్ధికి గూడ్స్ రైళ్లు తిరుగుతున్నాయి. ప్రయాణికులకు రైలు ప్రయాణం మరింత సులభతరం చేసేందుకు రూ. 50 కోట్లతో విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. ఏడాదిన్నర క్రితం నుంచి ఈ మార్గంలో విద్యుత్ రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. డీజిల్ ద్వారా నడిచే రైలు కంటే విద్యుత్ రైళ్లతో ప్రయాణ సమయం ఆదా అయి త్వరగా గమ్యస్థానాలు చేరుకుంటుండటంతో ప్రజలు రైలు ప్రయాణం వైపు మొగ్గు చూపుతున్నారు.

జనరల్ బోగీలు పెంచాలని వినతి

నంద్యాల-ఎర్రగుంట్ల మార్గంలో 2022 ఆగస్టు 18వ తేదీ నుంచి గుంటూరు నుంచి తిరుపతికి ఎక్స్‌ప్రెస్ రైలు నడుస్తోంది. గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం, గిద్దలూరు, నంద్యాల, బనగానపల్లె, ప్రొద్దుటూరు, కడప, రాజంపేట, రేణిగుంట రైల్వేస్టేషన్లలో మాత్రమే ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేది. రెండు జిల్లాల ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల అభ్యర్థన మేరకు ఏడాది నుంచి నంద్యాల జిల్లా కోవెలకుంట్ల, వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు రైల్వేస్టేషన్లలో స్టాపింగ్ ఏర్పాటు చేశారు. తిరుపతి వెంకన్నస్వామి దర్శనానికి రైలు ప్రయాణం దగ్గరి మార్గం కావడంతో రద్దీ తగ్గడం లేదు. గతంలో గుంటూరు, ప్రకాశం జిల్లాల ప్రజలు రైలు మార్గం ద్వారా తిరుపతికి వెళ్లాలంటే విజయవాడ మీదుగా, నంద్యాల, వైఎస్సార్ జిల్లా ప్రజలు కడప వరకు బస్సు, రైలు మార్గం ద్వారా చేరుకుని అక్కడి నుంచి తిరుపతికి వెళ్లాల్సి వచ్చేది. ప్రయాణికులు అనేక వ్యయ ప్రయాసలు ఎదుర్కొని రాకపోకలు సాగించేవారు. తిరుపతి రైలు పట్టాలెక్కడంతో ఆయా జిల్లాల ప్రజలకు రైలు ప్రయాణం మరింత చేరువైంది. దైవదర్శనంతో పాటు ఆయా జిల్లాల్లోని వివిధ ముఖ్య పట్టణాలకు బస్సు ప్రయాణం కంటే రైలు ప్రయాణం దగ్గరి మార్గం కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా పట్టణాల్లో బంగారు ఆభరణాలు, పట్టుచీరలు, వస్త్ర, తదితర వ్యాపార నిమిత్తం ప్రజలు, వ్యాపారులు రైలు ప్రయాణం సాగిస్తున్నారు. దీంతో ఆయా జిల్లాల్లో పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి రైలుకు అదనంగా జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలని ఆయా జిల్లాల వాసులు రైల్వేశాఖ అధికారులను విన్నవించుకుంటున్నారు

మరికొన్ని రైళ్లు నడపాలని ప్రతిపాదన

నంద్యాల- ఎర్రగుంట్లరైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలు క్రమంగా పెరుగుతున్నాయి. రాకపోకలు ప్రారంభమైన మొదట్లో నంద్యాల నుంచి కడప వరకు వారంలో ఆరు రోజులు డెమో రైలు నడిచేది. తర్వాత ఆరు నెలలకు ధర్మవరం నుంచి రాష్ట్ర రాజధాని అమరావతికి వారంలో మూడు రోజుల మాత్రమే ఎక్స్‌ప్రెస్ రైలు తిరిగేది. 2018వ సంవత్సరం నుంచి డెమో రైలును వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి వరకు, గత ఏడాది నుంచి చిత్తూరు జిల్లా రేణిగుంట వరకు పొడిగించారు. డెమోతోపాటు ధర్మవరం, తిరుపతికి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రతి రోజు నడిచేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మార్గంలో ప్రతి రోజు మూడురైళ్ల ద్వారా ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. అలాగే ఉత్తర భారదేశానికి రైలు కనెక్టివిటీని విస్తరించేందుకు 2020వ సంవత్సరం నుంచి ఈ మార్గంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రైలు నడపాలని ప్రతిపాదన ఉండేది. ఆ ఏడాది కరోనా వైరస్ విజృంభించడంతో ఆ ప్రాతిపాదనను రైల్వే అధికారులు రద్దు చేశారు. తిరిగి ఈ ప్రతిపాదనపై రైల్వే శాఖ దృష్టి సారించింది. రాబోయే రోజుల్లో ఈ రైలు పట్టాలెక్కితే నంద్యాల, ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల ప్రజలకు రైలు ప్రయాణం మరింత చేరువకానుంది.

రద్దీ ఎక్కువగా ఉంటోంది



నంద్యాల- ఎర్రగుంట్ల రైల్వే మార్గంలో ప్రస్తుతం పగటి వేళ డెమో రైలు మాత్రమే నడుస్తోంది. ధర్మవరం, తిరుపతి రైళ్లు రాత్రి వేళల్లో తిరుగుతున్నాయి. ఎక్స్‌ప్రెస్ రైళ్లను రాత్రి వేళల్లో కాకుండా పగటి వేళల్లో నడిచేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలి. తిరుపతి రైలుకు రెండు మాత్రమే జనరల్ బోగీలు ఉన్నాయి. తిరుపతి వెంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రతి రోజు వందలాది మంది భక్తులు వెళుతున్నారు. జనరల్ బోగీలు తక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మరో రెండు జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలి.

– మాబుఉసేన్, కోవెలకుంట్ల

వ్యయ ప్రయాసలు తగ్గాయి



ప్రయాణికులకు రైలు ప్రయాణం సులభతరమైంది. గతంలో తిరుపతి, అమరావతి, తదితర ముఖ్య పట్టణాలకు బస్సుమార్గంలో వెళ్లాల్సి వచ్చేది. దీంతో అనేక వ్యయ ప్రయాసలు ఎదుర్కొనేవారు. బస్సుల ద్వారా ప్రయాణానికి సమయం వృథా అయ్యేది. ఆయా ప్రాంతాలకు రైళ్లు నడుస్తుండటంతో ప్రజలకు రైలు ప్రయాణం మరింత చేరువైంది.

– దినకర్, వల్లంపాడు, కోవెలకుంట్ల మండలం

బక్రీద్ పండుగకు పటిష్ట భద్రత

- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



మసీదుల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు : బక్రీద్ పండుగను పురస్కరించుకుని పోలీసు శాఖ కర్నూలు నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. దాదాపు వివిధ హోదాల్లో ఉన్న 300 మంది సిబ్బందిని బందోబస్తు విధులకు నియమించారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదివారం స్వయంగా భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాతబస్తీలో పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగర శివారులోని జొహరాపురం, పూలబజార్, గుత్తి పెట్రోల్ బంకు, సంతోష్ నగర్ హైవే వద్ద ఉన్న కొత్త ఈద్గా వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు, పోలీసు బందోబస్తు ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. కర్నూలు మతసామరస్యానికి ప్రతీక అని, సోమవారం బక్రీదు పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఏదైనా సమస్యలు తలెత్తితే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. శాంతియుత వాతావరణానికి భంగం కలిగించేవారిపై నిఘా ఉంచినట్లు తెలిపారు. పోలీస్ చెక్‌పోస్టులను కూడా ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు నగరంలో పోలీస్ పికెట్లు, మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసి నిఘా పెట్టినట్లు తెలిపారు. పుకార్లు, వదంతులను నమ్మవద్దని, సమస్యలు ఉంటే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. డీఎస్పీ విజయశేఖర్, సీఐలు నాగరాజు యాదవ్, ప్రసాద్, పవన్‌కుమార్, శంకరయ్య, గౌతమి, ఎస్‌ఐ ఖాజావలి తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.

రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రజక విద్యా సేవా సమితి నేతలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన రజక సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు రజక విద్యా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సీపీ వెంకటేష్ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ప్రతిభా పురస్కారాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. 10వ తరగతిలో 450 మార్కులు, ఇంటర్‌లో 850కి పైగా మార్కులు సాధించిన వారికి, డిగ్రీలో 80 శాతం, బీటెక్‌లో 80 శాతం మార్కులతో ఉత్తీర్ణత, మెడిసిన్, ఇంజినీరింగ్‌లో 10 వేల లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందిస్తామని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు తమ దరఖాస్తులను జూలై 31వ తేదిలోగా షాప్ నంబర్: 9, నాలుగవ అంతస్థు, స్కంధ బిజినెస్ పార్క్, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్ జిల్లా పరిషత్ ఎదురుగా, కర్నూలు అనే చిరునామాలో అందించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9110396511, 9182708114, 7780506001, 9640500145 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మాలంగిరి గణేష్, సీహెచ్ లింగమయ్య, మాజీ సైనికోద్యోగి శంకరయ్య, మహిళా నాయకురాళ్లు బాపనపల్లి రాధ, రేణుకమ్మ, మద్దూరు వెంకట్, ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోనేరులో పడి వ్యక్తి మృతి

బేతంచెర్ల: శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయ నీటి కోనేరులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం గద్వాల మండలం వడ్డెపల్లికి చెందిన కురువ మహేష్ (34) శనివారం ఆలయానికి వచ్చాడు. ఉదయం 10 గంటల సమయంలో ఆలయ కోనేరులో ఈతకు వెళ్లాడు. గుంత ఉండడంతో అందులో మునిగి కనిపించలేదు. విషయం తెలుసుకున్న బంధువులు నీటి కోనేరు వద్దకు వచ్చి వెతికారు. లభ్యం కాకపోవడంతో వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం మృతదేహం బయట పడింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నీటి కోనేరు పక్కన ముళ్ల పొదల్లో ఫోను లభించడంతో, మొబైల్ ఫోనులోని నంబర్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి పంపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వైస్ ఎంపీపీపై దాడికి టీడీపీ కార్యకర్తల యత్నం

జూపాడుబంగ్లా: మండ్లెం గ్రామానికి చెందిన మండల వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు దాడికి యత్నించినట్లు బాధితుడు ఆదివారం సాయంత్రం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు.. పొలం వద్ద ఉన్న కృష్ణారెడ్డికి టీడీపీ కార్యకర్త గొల్ల మధు ఫోన్ చేసి చాకలి ఆనంద్ సెల్ నంబర్ ఇవ్వాలని కోరాడు. తన వద్ద నంబర్ లేదని చెప్పటంతో ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడ్డాడు. అనంతరం మద్యం మత్తులో ఉన్న మధు, గొల్ల రామకృష్ణ, తెలుగు అశోక్, గొల్ల పవన్, తెలుగు మల్లి, తెలుగు పుల్లయ్యలు కృష్ణారెడ్డి ఇంటివద్దకు వచ్చి దాడి చేసేందుకు యత్నించారు. వారందరూ తెలుపు రంగు స్కార్పియో వాహనంలో వచ్చారని, తనను కిడ్నాప్ చేసి చంపాలనే ప్రయత్నం చేశారని బాధితుడు లిఖితపూర్వకంగా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం

- విద్యుత్ తీగలు తగిలి మహిళ మృతి



మృతురాలు లక్ష్మి (ఫైల్)

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో లక్ష్మి(31) అనే మహిళకు విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వీరేష్ భార్య లక్ష్మి పొలం నుంచి వస్తుండగా దారిలో విద్యుత్ తీగలు పడిపోయి ఉన్నాయి. గమనించకుండా వాటి పక్కనే రావడంతో తీగలు తగి విద్యుత్‌ఘాతానికి గురై మృతిచెందింది. ఎంతసేపటికీ లక్ష్మి ఇంటికి రాకపోవడంతో భర్త వీరేష్ పొలం రహదారి గుండా వెళ్తుండగా విద్యుత్ తీగల వద్ద పడి ఉన్న భార్య లక్ష్మిని చూసి కన్నీరుమున్నీరుగా విలపించాడు. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించి, ఆ మార్గంలో విద్యుత్ సరఫరా నిలిపివేయించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మికి ముగ్గురు మగ పిల్లలు ప్రసాద్, మల్లయ్య, విజయ్ సంతానం. తల్లి మృతితో చిన్నారులు బోరుమని విలపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర విలేకరులకు తెలిపారు.

వంతెనపై నుంచి ఆటో బోల్తా

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రి సమీపంలోని వక్కిలేరు వంతెనపై నుంచి ఓ ఆటో ప్రమాదవశాత్తూ వాగులో బోల్తా పడింది. స్థానిక ఖల్లగడ్డ వీధికి చెందిన కొంత మంది యువకులు ఆదివారం సరదాగా ఆటోలో వక్కిలేరు వాగు వద్దకు బయలుదేరారు. కాగా ఆటో అదుపు తప్పి వంతెనపై నుంచి రెయిలింగ్ స్తంభాలను ఢీకొట్టి వాగులో బోల్తా పడింది. వాగులో నీటి ప్రవాహం ఉండటంతో నలుగురు గాయాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడిన మధు, వెంకటేశంను మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

టమాట సాగులో నారుమడి కీలకం

- ట్రేలలోనూ నారు పెంచవచ్చు
- సాగుకు అన్ని రకాల నేలలు అనుకూలం
- జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు సూచనలు



పి.రామాంజనేయులు



సాగులో ఉన్న టమాట

కర్నూలు (అగ్రికల్చర్): జిల్లాలో సాగయ్యే కూరగాయల పంటల్లో టమాట ప్రధానమైంది. కర్నూలు, ఆదోని డివిజన్‌లో ఈ పంట భారీ ఎత్తున సాగవుతోంది. డోన్, ప్యాపిలి, దేవనకొండ, పెద్దకడుబూరు, పత్తికొండ, తుగ్గలి, వెల్దుర్తి, మద్దికెర, ఓర్వకల్లు, ఆలూరు, ఆస్పరి, హాలహర్వి, హొళగుంద, కృష్ణగిరి, కల్లూరు మండలాల్లో ప్రధాన పంటగా ఉంది. వర్షాలు విస్తారంగా పడుతుండటంతో రైతులు టమాట సాగు సిద్ధం అవుతున్నారు. ఇది శీతాకాలపు పంట అయినప్పటికీ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఏడాది పొడవునా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా టమాట సాగుకు రైతులు సిద్ధం అవుతున్న నేపథ్యంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి.రామాంజనేయులు సాగు పద్ధతులు, విత్తనాల ఎంపిక, నేలలు, నారుమడి తయారీ తదితర అంశాలను వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

'' అన్ని రకాల నేలల్లో టమాట సాగు చేయవచ్చు. ఇసుకతో కూడిన గరప నేలల నుండి బరువైన బంకనేలల్లో కూడా ఈ పంటను సాగు చేయవచ్చు. మురుగు నీటి వసతి లేని భూములు, చౌడు భూములు టమాట సాగుకు పనికిరావు. పూసా ఎర్లీడ్వార్ఫ్, పూసారూబీ అర్కా వికస్ అర్కాసౌరబ్, మారుధము వంటి సూటి రకాలు గాని, నవీన్, రూపాలి, వైశాలి, రశ్మి వంటి సంకర రకాలు అనుకూలమైనవి.

విత్తన మోతాదు, విత్తన శుద్ధి

ఎకరాకు సూటి రకాలు 200 గ్రాములు, సంకర రకాలు కేవలం 60 గ్రాములు సరిపోతాయి. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రాముల మెటలాక్సిల్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. 2 గంటల తర్వాత 8 గ్రాముల ట్రైకోడెర్మా కల్చర్ కలిపి శుద్ధి చేయాలి. రసంపీల్చే పురుగుల బెడదను తట్టుకునేందుకు ఇమిడా క్లోప్రిడ్ 5 గ్రాములు కిలో విత్తనానికి పట్టించి తర్వాత శిలీంద్రనాశినితో శుద్ధిచేయాలి.

ఎత్తుమళ్లు ఎంతో మేలు.

ఎకరా భూమిలో టమాట నాటుకోవడానికి 1 ఇంటు 4 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన 8 నుంచి 10 నారు మళ్లను తయారు చేసుకోవాలి. ఈ మళ్లలో బాగా మాగిన పశువుల, ఎరువును వేసి కలిపి ఆరు అంగుళాలు ఎత్తయిన నారుమళ్లు తయారు చేసుకోవాలి. సాధారణంగా రైతులు చదును మళ్లను తయారు చేస్తారు. వీటిపై నారును పెంచడం వల్ల నారు కుళ్లు ఎక్కువగా వచ్చి నారు చనిపోవడమే గాక, నారుమడి సమానంగా పెరగదు. అందువల్ల విధిగా ఎత్తుమళ్లను తయారు చేసుకోవాలి. నారుకుళ్లు రాకుండా ముందు జాగ్రత్తగా 0.5 శాతం బోర్డోమిశ్రమం లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, లేదా డైథేన్ జెడ్-78 లేదా డైథేన్ ఎ-45 మందు 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి నారుమడిని తడపాలి. ఇందుకు 100 లీటర్ల మందు ద్రావణాన్ని ఒక సెంటు నారుమడికి వాడాలి. నారుమడిలో 10 సెంటీమీటర్ల ఎడంతో వరుసల్లో 1 నుంచి 15 సెంటీమీటర్ల లోతుల్లో విత్తనాలను పలుచగా విత్తుకోవాలి. విత్తిన వెంటనే రోజ్‌క్యాన్‌తో నీటిని చల్లి పాలిథీన్ షీట్, లేదా వరిగడ్డితో నారుమళ్లను కప్పాలి. విత్తనాలు మొలకెత్తిన వెంటనే 7-10 రోజులకు మల్చింగ్ వేసిన పాలిథిన్ షీట్‌ను లేదా వరిగడ్డిని తీసి వేయాలి.

ట్రేలలో పెంపకం ఇలా..

ఇటీవలి కాలంలో చాలా మంది రైతులు నారు పెంచేందుకు ట్రేలను వాడుతున్నారు. వీటిని ప్రోట్రేలు అంటారు. ఈ ట్రేలలో కోకోపిట్‌ను వాడి నారు పెంచుతారు. నారు దశలో వచ్చే నారుకుళ్లు తెగులు నివారణకు 1టన్ను కోకోఫిట్‌కు 100 కిలోల వేపచెక్క, 1 కిలో ట్రైకోడెర్మా విరిడి మిశ్రమాన్ని తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని ట్రేలలో నింపాలి. ఒక ట్రేలో 98 గుంతలు ఉంటాయి. ఒక ట్రే నింపేందుకు 125 కిలోల మిశ్రమం అవసరమం అవుతుంది. ఈ విధంగా నింపిన ట్రేలలో ముందుగా విత్తన శుద్ధి చేసిన విత్తనాన్ని 0.5 సెంటీమీటర్ల లోతులో వేసి పైభాగాన కోకోఫిట్‌తో నింపాలి. ఈ విధంగా నింపిన ట్రేలను ఒకదానిపై ఒకటి (10ట్రేలు) అమర్చి పాలిథీన్ షీట్‌లో కప్పాలి. విత్తిన 3-6 రోజుల్లో విత్తనం మొలకెత్తడం అవగానే ట్రేలను వేరు చేయాలి. రోజ్‌క్యాన్ లేదా పైపులతో ట్రేలను తడపాలి. నారు పోషణ కోసం 19:19:19 మిశ్రమాన్ని 3 గ్రాములు లీటరు నీటికి కలిపి విత్తిన 12-20 రోజులకు పిచికారీ చేయాలి.

నారుకుళ్లు సోకకుండా

నారుమళ్లలో నారుకుళ్లు సోకకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారులో 20 రోజులకు రసంపీల్చే పురుగుల నివారణకు సాధారణ నారుమడిలో కార్బోఫ్యూరాన్ 3 జిగుళికలు ఒక సెంటుకు 100 గ్రాముల చొప్పున వేసి నీరు పెట్టాలి. నారు పెరకడానికి ముందు , పొలంలో నాటనడానికి 23 రోజుల ముందు లీటరు నీనటికి 2 ఎంఎల్ రోగాడ్ లేదా 0.3 ఎంఎల్ ఇమిడాక్లోఫ్రిడ్, 1 గ్రాము బావిస్టిన్ కలిపి పిచికారి చేయాలి. 25-30 రోజుల వయస్సు గల నారును ప్రధాన పొలంలో నాటుకోవాలి.

ఇలా నాటు కోవాలి..

పొలాన్ని బాగా దున్ని చదును చేసుకోవాలి. దుక్కి సరిగా లేకపోతే ప్రధానంగా వేరు ముడపడి తర్వాత మొక్కలు చనిపోతాయి. రెండు చాళ్లమధ్య 60 సెంటీమీటర్లు ఉండాలి. చాలులో మొక్కకు మొక్కు మధ్య 40 సెం.మీ ఉండే విధంగా నాటుకోవాలి. డ్రిప్ కింద సాగు చేస్తే జంటసాళ్ల పద్ధతిలో సాగు చేసుకుంటే మంచిది. వేరు ముడత పడేటట్లుగా నాటితే కాయదశకు చేరుకోగానే పోషకాలను సరిపడేంత తీసుకోలేక మొక్కలు ఎండిపోతాయి. నాటేటపుడు ప్రధాన వేరు ముడత పడకుండా జాగ్రత్త వహించాలి.

ఎరువులు

చివరిదుక్కిలో ఎకరానికి 6 నుంచి 8 టన్నుల పశువుల ఎరువు వేసి కలియ దున్నాలి. పశువుల ఎకరువుతో పాటు ట్రైకోడెర్మా విరిడిని కూడా ఎకరానికి 2 కిలోలు భూమిలో వేసి కలియదున్నితే నేల నుంచి సంక్రమించే కుళ్లు తెగుళ్ల నుండి పంటను కాపాడుకోవచ్చు. నారు నాటేటప్పుడు ఎకరానికి 24 కిలోల భాస్వరం (150 కిలోల ఎస్ఎస్‌పీ), 24 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను (40 కిలో ఎంఓపీ) వేయాలి. 48-60 కిలోల నత్రజనిని (100-120 కిలోల యూరియా) మూడు సమభాగాలుగా చేసి నాటిన 30, 45, 60 రోజులకు పైపాటుగా బోదెల్లో వేసి మట్టిని ఎగదోయాలి. పూత దశలో లీటరు నీటికి 20 గ్రాముల యూరియాను కలిపి పిచికారీ చేస్తే 15-20 శాతం దిగుబడి పెరుగుతుంది. నాటేముందు ఎకరాకు 5-12 కిలోల బోరాక్స్ వేయాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. నాటిన తర్వాత 30-35 రోజులకు లీటరు నీటికి 5 గ్రాములు జింక్ సల్ఫేటు కలిపి పిచికారీ చేస్తే 20 శాతం అధిక దిగుబడి పొందవచ్చు. పూతదశలో ప్లానోఫిక్స్, 1 ఎంఎల్ 4 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణం పిచికారీ చేస్తే పూత పిందె నిలిచి దిగుబడి పెరుగుతుంది.

ఊతమివ్వడం

టమాట రకాలలో, సంకర రకాలలో (నవీన్, అవినాష్‌లు) పొడవుగా పెరిగే రకాలు, పొదలుగా పెరిగే రకాలు ఉన్నాయి. ముఖ్యంగా పొడవుగా పెరిగే సంకర రకాలలో మంచి పరిమాణం గల కాయలు ఏర్పడుతాయి. అయితే వీటికి ఊతమివ్వాలి. ఊతమివ్వకపోతే భూమికి తగిలి చెడిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ రకాలను ఊత కర్రల సాయంతో స్టేకింగ్ చేయడం తప్పనిసరి. ఊతమివ్వడం వల్ల కాయలు భూమికి తగలవు. గాలి, వెలుతురు, బాగా లభిస్తుంది. ఇంతేగాక కాయకోత సులువు అవుతుంది.''